క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. గురువారంతో పాటు మిలాదున్నబీ వేడుకలు కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యంలో తరలివచ్చి స్వామి సన్నిధిలో గడిపారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

దురాచారాలను ఎండగట్టిన కవి జాషువా



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభ్యుదయ రచయితల సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: సమాజంలో నెలకొన్న సాంఘిక దురాచారాలను తన కవిత్వంతో ఎండగట్టిన మహాకవి గుర్రం జాషువా అని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) వక్తలు అవుల బసప్ప, కేసీ.మల్లికార్జున, నల్లారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కిడ్డీస్ పాఠశాలలో గుర్రం జాషువా జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అరసం జిల్లా అధ్యక్షుడు కె.ప్రహ్లాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీ ప్రియులు నాగన్న, సక్కిరి భాస్కర్, ఈరన్నగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆదోనిఅర్బన్: ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మిత్ర ఎంటర్‌ప్రైజెస్ షాపులో బుధవారం వృద్ధులకు 250 కేజీల బియ్యం, 20 కేజీల కందిబేడలు, 30 నూనె ప్యాకెట్లు అందజేశారు. వివేకానంద సంస్థ సహాయకుల చేతులమీదుగా వాటిని పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు జితేంద్ర గారి తల్లి పార్వతమ్మ జ్ఞాపకార్థంగా ఈ వితరణ చేపట్టడం జరిగిందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. సభ్యులు లలిత, లక్ష్మీదేవి, బసవరాజ్, రీజియన్ చైర్మన్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సాహసోపేత నిర్ణయం



మాట్లాడుతున్న వెల్లాల మధుసూదన శర్మ

ఆదోనిఅర్బన్ : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన చేపట్టేలా చర్యలు తీసుకోవడం సాహసోపేత నిర్ణయమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ పౌర సరఫరాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శ్రీకృష్ణ కమిటీ కులగణనతో పాటుగా రాష్ట్రంలో వివిధ అంశాలపైన అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగిందన్నారు. దీంతో రాష్ట్రంలో జనాభా పరంగా అధిక సంఖ్యలో ఉండి అణగారిన, అగ్రవర్ణ పేదలకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రాజకీయ, ఆర్థిక, సామాజికంగా విద్య, వైద్యం వంటి వివిధ ప్రాధాన్యత అంశాల్లో సంపూర్ణ న్యాయం జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి.నాగరాజు, యూటీఎఫ్ నాయకులు గాదిలింగప్ప కోరారు. గురువారం మండల విద్యాధికారి బి.శివరాములును కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ విధులలో బాగంగా వర్క్ అడ్జస్ట్‌పై వేరే పాఠశాలలకు పంపిన ఉపాధ్యాయులకు రూ.2500 గౌరవ వేతనం బిల్లు పెట్టాలని కోరారు. సరెండర్స్ సెలవులను నగదుగా మార్చుకోవడానికి ఇచ్చిన బిల్లులు, ప్రతి నెలా జీతాల బిల్లులను సకాలంలో వచ్చే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టీయూ నాయకులు ఎంసి.సుంకన్న, బి.గోపాల్, బి. మహదేవప్ప, తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయం



తల్లీ, బిడ్డకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

డివిజన్‌లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు గర్భిణులు, బాలింతలకు అందించిన వైద్య సేవలు ఇలా

ఆరోగ్యకేంద్రం	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు
బదినేహాలు	92	105	89	87	68
దైవందిన్నె	110	121	126	118	103
గజ్జహల్లి	47	51	52	43	39
గోనెగొండ్ల	159	148	162	146	109
హాలహర్వి	57	56	56	56	42
హొళగుంద	84	75	83	81	63
కల్లుదేవకుంట	120	131	155	135	131
కోసిగి	166	173	172	155	164
కౌతాళం	100	86	65	67	62
నందవరం	65	96	106	95	89
పెద్దహరివాణం	90	111	105	89	94
పెద్దకడబూరు	101	104	133	103	102
పెద్దతుంబళం	89	103	115	107	93

ఆదోని సెంట్రల్: తల్లీబిడ్డల సంరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం గర్భిణులు, బాలింతలకు వరంగా మారింది. ఆదోని డివిజన్‌లో దీర్ఘకాలిక వ్యాదులతో బాధపడుతున్న వారు గాకుండా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ) ఏప్రిల్ 23 నుంచి ఆగస్టు 23 వరకు 6,500 మంది గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు . ప్రతి నెలా ప్రభుత్వ ఆసుపత్రిలో 9న ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎం) నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులకు మధుమేహం, బీపీ వంటి రక్త పరీక్షలు చేసి తల్లీబిడ్డల ఆరోగ్యంపై అవసరం మేరకు స్కానింగ్‌లు వంటి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందిస్తున్నారు.

వైద్య సేవలు ఇలా

పీఎంఎస్ఎం డే రోజున ఆసుపత్రులలో, ఫ్యామిలీ డాక్టర్ గ్రామాలకు వచ్చిన సందర్భాల్లో వైద్య సేవలు అందిస్తారు. మిగిలిన రోజుల్లో గ్రామాల్లోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో ఉండే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ) ఏఎన్ఎంలు వారి ఆరోగ్య సమస్యలపై వాకబు చేస్తుంటారు. అంతేగాకుండా ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించి రక్తహీనతను గుర్తిస్తారు. రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిపై మరింత శ్రద్ధ చూపుతారు. వారి ఆరోగ్య సంరక్షణకు తగిన మందులు, ఇంజెక్షన్లు వేస్తారు.



104 వాహనంలో గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషణ

గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో బాధపడకుండా తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషకాహారం అందిస్తోంది. టేక్ హోం రేషన్ కింద 3 కిలోల బియ్యం, కిలో కంది పప్పు, అరకిలో వంటనూనె, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు, 2 కిలోల రాగిపిండి, కేజీ అటుకులు, అర కిలో బెల్లం, అర కిలో చిక్కీ, అర కిలో డ్రైఫ్రూట్స్ వంటివి అందిస్తున్నారు. పిల్లల ఎదుగుదల, టీకాలు, పౌష్టికాహారం, ఆరోగ్య అలవాట్లపై పర్యవేక్షణ ఉండే విధంగా ఫ్యామిలీ డాక్టర్‌తో అనుసంధానం చేసి వారి సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నారు

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు



గతంలో చిన్న చిన్న సమస్యలకు ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. వార్డు సచివాలయాలు వచ్చిన తరువాత ఎఎన్ఎంలు ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. చిన్న పిల్లలకు టీకాలు వేయించుకోవడానికి కూడా ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా సచివాలయంలోనే టీకాలు వేస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద పోషకాహారం నిమిత్తం సరుకులను అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. నెలలో రెండు సార్లు డాక్టర్లు వచ్చి వైద్యం చేస్తున్నారు. – పార్వతి, కల్లుబావి గ్రామం

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత



తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. 104 వాహనాలు గ్రామాలకు వెళ్లినపుడు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తారు. అలా గ్రామానికి వెళ్లిన సందర్భాల్లో రెండు లేదా మూడు సార్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మిగతా రోజుల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా కమ్యూనిటీ హెల్త్ అఫీసర్, ఏఎన్ఎంలు వారి ఆరోగ్య విషయాలను తెలుసుకొని వారికి తగిన సలహాలు, సూచనలను అందిస్తారు. – డాక్టర్ సత్యవతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

అలరించిన దాసవాణి

మంత్రాలయం: చాతుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హరికథ పారాయణం, దాసవాణి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. స్థానిక ప్రవచన మండపంలో గురువారం కర్ణాటకలోని మైసూరుకు చెందిన విధూషి ధన్య నాగరాజు దాసవాణి నిర్వహించారు. ఆమె ఆలపించిన హరిదాస కీర్తనలు భక్తులను వీనుల విందు చేశాయి. శ్రీమఠం శిష్య సంపర్కాధికారులు మంచాలి పద్మనాభ ఆచార్య, వాదీరాజ్ ఆచార్య పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

ఆదోనిఅర్బన్: పట్టణంలో గత వారం నుంచి కార్పెంటర్, వెల్డింగ్ షాపుల్లో చోరీలు ఎక్కువయ్యాయి. గత వారం పర్వతాపురం రోడ్డులో ఒకటి, రెండు నెలల క్రితం వరుసగా ఐదారు షాపుల్లో, బుధవారం వెల్డింగ్ షాపులో, గురువారం కార్పెంటర్, వెల్డింగ్ షాపులో చోరీ జరిగాయి. రేకులను తొలగించి బండలను పగులగొట్టి గురువారం తెల్లవారుజామున కార్పెంటర్, వెల్డింగ్ షాపుల్లో చోరీ జరిగిందని యజమానులు మస్తాన్, బందెనవాజ్ తెలిపారు. తాము చిన్నచిన్న పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నామని, గత వారం నుంచి పట్టణంలోని నూతన బ్రిడ్జి సమీపంలో చోరీలు జరుగుతున్నాయని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేస్తే డబ్బా రేకుల దుకాణాలు పెట్టుకోవద్దంటున్నారని ఆరోపించారు. దుకాణంలో వెల్డింగ్ మిషన్లు, అందుకు సంబంధించిన సెట్టు, కటింగ్ మిషన్, దీని విలువ రూ.30 వేలు వరకు ఉంటుందని చెప్పారు. పోలీసు అధికారులు ఈ ప్రాంతంలో గస్తీ, పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఘనంగా అనంత పద్మనాభ వ్రతం



ఊరేగింపుగా రణమండల కొండకు వెళ్తున్న హనుమ భక్తులు

ఆదోనిఅర్బన్: అనంత పద్మనాభ స్వామి వ్రతం సందర్భంగా గురువారం సాయిభక్త బృందం ఆధ్వర్యంలో రణమండల కొండలో వెలసిన ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. హనుమ దీక్ష స్వీకరించిన భక్తులు పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా జై శ్రీరామ్ నామస్మరణతో రణమండల కొండకు తరలివెళ్లారు. అక్కడి ఆంజనేయ స్వామికి పాలాభిషేకం చేయించారు. అనంతరం స్వామివారికి పూజారి ఆనంద ఆచారి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి గీతాలతో భజనలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే పట్టణ శివారులోని మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో అనంత పద్మనాభ వ్రతం పూజలు ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా పూజారి గురురాజ ఆచారి స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతి చేశారు. అనంతరం పద్మనాభ వ్రతం వేదపండితుల చేత జరిపించారు.

శ్రీమఠంలో న్యాయమూర్తులు



పీఠాధిపతితో ఆశీర్వాదం తీసుకుంటున్న అలంపూర్ జడ్జి కవిత

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి దర్శనార్థం పలువురు న్యాయమూర్తులు గురువారం మంత్రాలయం విచ్చేశారు. తెలంగాణలోని అలంపూర్ జోగులాంబ జిల్లా న్యాయమూర్తి కవిత, మరో జడ్జి శ్రీనివాస్ దర్శనం చేసుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసుకుని హారతులు పట్టారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలతో ఆశీర్వాదం చేశారు. మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

కౌతాళం: మండల పరిధిలోని కాత్రికి గ్రామంలో గురువారం పిచ్చి కుక్క దాడిలో హనుమంతమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసి హనమమంతమ్మను కాటు వేసి గాయపరిచింది. కాలనీవాసులు కుక్కను వెంబడించి హతమార్చారు. బాధితురాలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి గ్రామంలో కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న పికెట్

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేసిన సంఘటన తెలిసిందే. ఈ మేరకు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ ప్రశాంతత కోసం పోలీసులు పికెట్ నిర్వహించారు. గురువారం నాలుగోరోజు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో పికెట్ కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలు కృషి చేయాలన్నారు. చిన్నచిన్న విషయాలకే గొడవలు, ఘర్షణలకు పాల్పడరాదన్నారు. చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి వేరుశనగ క్రయవిక్రయాలు



మార్కెట్‌యార్డు చైర్మన్, సూపర్‌వైజర్‌లతో చర్చలు జరుపుతున్న వ్యాపారులు

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం నుంచి వేరుశనగకాయల క్రయ, విక్రయాలు జరుగుతాయని యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, సూపర్‌వైజర్ శాంతకుమార్ తెలిపారు. గురువారం స్థానిక యార్డు కార్యాలయంలో వేరుశనగ వ్యాపారరులు, హమాలీలకు యార్డు చైర్మన్, సూపర్‌వైజర్‌ల మధ్య చర్చ జరిగింది. వేరుశనగకాయల డిగార్డ్ గేటింగ్‌లో ఉన్న హమాలీలకు ధర పెంచాలని గత శుక్రవారం నుంచి ధర్నా చేపట్టిన విషయం విధితమే. గురువారం నాడు చర్చలు సఫలం కావడంతో శుక్రవారం నుంచి క్రయ, విక్రయాలు జరుగనున్నాయి. హమాలీలు 20 శాతం కూలి ధర పెంచాలని, వ్యాపారులు అంత పెంచలేమని చెప్పడంతో వారం రోజులపాటు క్రయ, విక్రయాలు బంద్ అయ్యాయి. దీంతో యార్డు చైర్మన్, సూపర్‌వైజర్ జోక్యం చేసుకొని ఇరువురిని కూర్చోబెట్టి 17 శాతం కూలీ ధర పెంచే విధంగా చర్చలు జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు శరణప్ప, వ్యాపారులు పాల్గొన్నారు.

తుది దశకు ఆరోగ్య సర్వే



ఇందిరానగర్‌లో మహిళకు బీపీ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఆదోనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. గురువారం ఆదోని పట్టణం, మండలంలోని గ్రామాల్లో సర్వే కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటికీ వెళ్లి డాక్టర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు సర్వే చేశారు. గడప గడపకు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, ఆ కుటుంబంలోని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి వివరాలను పక్కాగా సేకరిస్తున్నామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి తెలిపారు. పట్టణంలోని 42 వార్డులు, మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే కార్యక్రమం జరుగుతోంది. ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేయడం, ఈనెల 30వ తేదీన ఏర్పాటు చేసే వైద్య శిబిరాల్లో వైద్యం అందించడం చాలా గొప్ప విషయమని, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి వైద్య శిబిరాలు



మరాలీగేరిలో వ్యక్తికి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందించనున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. శనివారం కౌతాళంలో సచివాలయం–2 పరిధిలోని స్థానిక ఎస్‌డబ్ల్యూ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు టోకన్లు ఇచ్చిన వారందరికి ఈ క్యాంపు వద్దకు తీసుకుని రావాలని కోరారు. మండలంలోని వివిధ శాఖల అధికారులతో పాటు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ





భక్తుల సందర్శనార్థం ఉంచిన మహమ్మద్ ప్రవక్త వస్తువులు, గోఖర్ జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు



విన్యాసాలు చేస్తున్న ముస్లిం యువకులు



మహ్మద్ ప్రవక్త కేశాల ప్రదర్శన చేస్తున్న ధర్మకర్త మున్నపాషా చిష్టీ

ఆదోని సెంట్రల్/ ఆదోని రూరల్: మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకొని ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం జరుపుకున్నారు. పట్టణం, గ్రామీణ ప్రాంతంలోని పెద్ద హరివాణం, పెద్ద తుంబళం, ఇస్వి, మదిరె, సాంబగల్లు, సంతేకూడ్లూరు గ్రామాల్లో మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, దయ, కరుణ దాతృత్వం వంటివి అనుసరించాల్సిన అవశ్యకత ఉందని గురువులు బోధించారు. ప్రవక్త జీవితం మానవాళికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. కొంతమంది ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. పట్టణంలోని కొడల్ పేట, నిర్మల్ టాకీస్ సమీపంలో ముక్తర్ అహ్మద్ సాహెబ్ ఇంటి వద్ద మహమ్మద్ ప్రవక్త వాడిన వస్తువులు, తలనీలాలు వంటి వాటిని భక్తుల సందర్శనార్థం ఉంచారు. వాటిని తిలకించడానికి భక్తులు ఉదయం నుంచి బారలు తీరారు. ఒకరినొకరు అలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. గురువారం మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని కోసిగిలోని స్థానిక కటికె వీధి, నూరాణి సున్నీ మజీద్, మదినా, మస్జీద్ ఏ అక్సా, మస్జీద్ ఏ అన్వరుల్లా ఫారుఖీ మసీదులలో మైనార్టీ కాలనీలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదులను విద్యుద్దీపాలు, జెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం కటికె వీధి నుంచి గోఖర్ జెండాను పురవీధుల గుండా ఊరేగించారు. యువకులు కర్ర దుంగలను ఎత్తి విన్యాసాలు చేశారు. ఆయా మజీద్, కటికె వీధి, మైనార్టీ కాలనీల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెద్దకడబూరు: ఇస్లాం మతాన్ని స్థాపించిన మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మదీన మసీద్ నుంచి ముస్లింలు రిబ్బన్స్, జెండాలు, బ్యానర్లతో గ్రామ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభకాంక్షలు తెలుపుకున్నారు. మత గురువు రహిమాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో నడుస్తూ శాంతియుతంగా జీవించాలని సూచించారు.

కౌతాళం: మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గమే సరైనదని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టి, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్టీలు అన్నారు. గురువారం మిలాద్–ఉన్–నబీ పండుగ వేడుకలను కౌతాళంతో పాటు కామవరం, చిరుతాపల్లి,చూడి, హల్వీ, నదిచాగి, ఉప్పరహల్, కుంటనహల్, బదినేహల్, గుడికంబాలి గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆయా జామీయ మసీదుల్లో అన్నదానం చేశారు. కౌతాళంలో ఆసరే ముబరక్ (ప్రవక్త కేశాల) ప్రదర్శనను ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మున్నపాషా వుసేని చిష్టీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అంతకు ముందు గ్రామ పుర వీధులగుండా ప్రవక్త జెండాను ఊరేగించారు. తక్బీర్లు చదువుకుంటూ ఊరేగింపు నిర్వహించారు.

మంత్రాలయం: పవిత్ర మిలాద్ ఉన్ నబి పర్వదినం వేడుకలు మంత్రాలయంలో ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని జామియా మసీదులో ముస్లింలు ప్రత్యేక పార్థనలు చేపట్టారు. గురువారం రాత్రి మంత్రాలయం వీధుల్లో శాంతి యాత్ర చేశారు. శ్రీమఠం ప్రధాన ముఖద్వారం నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు.



పెద్దకడబూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



మక్కా, మదీనా నమూనా

రఘువరేంద్ర తీర్థులకు సన్మానం



భీమనకట్టి మఠం పీఠాధిపతి రఘువరేంద్రతీర్థులను సత్కరిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: కర్ణాటకలోని భీమనకట్టి మఠం పీఠాధిపతి రఘువరేంద్రతీర్థులు శ్రీమఠంలో చాతుర్మాస్య దీక్షను ఆచరించడం జరిగింది. దిగ్విజయంగా దీక్షను పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సత్కార కార్యక్రమం నిర్వహించారు. గురువారం రాత్రి మేళతాళాలు, కర్ణాటక డోలు వాయిద్యాలతో రఘు వరేంద్ర తీర్థులకు ఘన స్వాగతం పలికారు. ముందుగా రాఘవేంద్రుల మూల బృందావనంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డోలోత్సవ మండపంలో రఘు వరేంద్రతీర్థులకు సన్మానం చేపట్టారు. విశేష తలపాగా, శేష వస్త్రం, పూలమాలతో సత్కరించారు. అలాగే చాతుర్మాస్య కానుకగా రూ.5 లక్షల నగదును స్వామిజీకి అందజేశారు. పండిత కేసరి గిరియాచార్, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం



ఆదోనిలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: నేటి యువత భగత్ సింగ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పేర్కొన్నారు. సర్దార్ భగత్ సింగ్ 116వ జయంతి పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. భగత్ సింగ్ పోరాట పటిమ కలిగిన నాయకుడని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, గణేష్, దినేష్, శశి, పవన్, రాజు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగశీలి

దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగశీలి సర్దార్ భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శమని బీసీ హాస్టల్ వార్డెన్ విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం బీసీ బాలుర వసతి గృహంలో రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్‌పీఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: అమర వీరుడు భగత్ సింగ్ జయంతి కార్యక్రమం కోసిగిలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌వై) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎఫ్‌వై తాలుకా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. యుక్త వయస్సులో స్వాతంత్ర్య ఉద్యమం పట్ల ఆకర్షితుడై పోరాటాలు ప్రాణాలు అర్పించిన మహనీయుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. ఏఐవైఎఫ్ నాయకులు ప్రకాష్, నరసయ్య, దేవానంద్, బాబు, ఈరేష్, మారేష్, షణ్ముఖ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.